క్లుప్తంగా

మహిళల జీవనోపాధికి కృషి

ఫిరంగిపురం: మహిళల జీవనోపాధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత లబ్ధిదారులకు(ప్రీ ఇండక్షన్ శిక్షణ) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ పథకాల ద్వారా కుటుంబ ఆర్థిక స్వావలంబనకుగాను చేపట్టే పశుపోషణలో తీసుకోవాల్సిన మెళకువలు, యాజమాన్య పద్ధతులు, సంపూర్ణ పోషణ, సంపూర్ణ దాణా గురించి వారికి వివరించారు. మండలంలో జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల లబ్ధిదారులు 300 మంది వరకు ఉన్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పశువైద్యాధికారి కోటిరత్నం, సీసీ లక్ష్మి, మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రి శివారెడ్డి జీవితం ఆదర్శప్రాయం

తాడేపల్లిరూరల్: సీపీఎం సీనియర్ నాయకులు సింహాద్రి శివారెడ్డి జీవితం ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలను, లక్ష్యాల స్ఫూర్తితో ముందుకు సాగాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. శుక్రవారం దుగ్గిరాలలోని పార్టీ కార్యాలయంలో సింహాద్రి శివారెడ్డి 6వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా ఉద్యమ నిర్మాతల్లో శివారెడ్డి ఒకరని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగాను, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, సీనియర్ నాయకులు వల్లభనేని సాంబశివరావు, దుగ్గిరాల మండల నాయకులు ఎస్.యోగేశ్వరరావు, ఎం. నాగమల్లేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, కె.కోటయ్య, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు సీఐ వాసు బాధ్యతల స్వీకారం



మేడికొండూరు: మేడికొండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వాసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాత గుంటూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన అల్తాఫ్ హుస్సేన్ గుంటూరు వీఆర్‌కు వెళ్లారు. వాసు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై తనను స్వయంగా సంప్రదించవచ్చని తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రత్యేక నిఘాను గ్రామాల్లో పటిష్టపరుస్తామని తెలిపారు. పేరేచర్ల, మేడికొండూరు ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.

ఈ-పంటనమోదుతో పలు ప్రయోజనాలు



ఫిరంగిపురం: ఈ-పంట నమోదుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ రమణకుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 1730 ఎకరాలకుగాను 1700 ఎకరాల్లో శుక్రవారం నాటికి ఈ-పంట నమోదు కార్యక్రమం జరిగినట్లు తెలిపారు. రబీ సీజన్‌లో 500 ఎకరాల్లో మొక్కజొన్న, 300 ఎకరాల్లో శనగలు, 900 ఎకరాల్లో వరిపంటను నమోదు చేశామన్నారు. ఈ-పంట నమోదు 28తో ముగుస్తుందని మిగిలిన రైతులు ఆయా గ్రామాల్లోని వీఏఏలను సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. వాటి వివరాలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ ఓ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చాలా మంది ప్రజలకు తెలియడం లేదని ఈ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో కరపత్రాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పట్టణ అధ్యక్షులు మాదాల వెంకటకృష్ణ, నాయకులు అలివేణి వెంకటరావు, కామేపల్లి వెంకటేశ్వర్లు, మునగాల నాగేశ్వరరావు, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: టిడ్కో గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మార్చి 2వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. శుక్రవారం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సీపీఐ పోరుబాట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్నవరపు ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్చి 10 నాటికి సర్వే పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- రెవెన్యూ, నగర పాలక సంస్థ అధికారులతో 22-ఎపై సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లిరూరల్: మార్చి 10వ తేదీ నాటికి సర్వే చేసి సెక్షన్ 22-ఎ జాబితా నుంచి ఆ ప్రాంతాలను తొలగించి రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులను కోరారు. శుక్రవారం మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ తాడేపల్లి కొండచుట్టూ ఉన్న నివాసాలు, నివాస స్థలాలు గతంలో రిజిస్ట్రేషన్లు జరిగేవని, 2012లో అప్పటి ప్రభుత్వం సెక్షన్ 22-ఎ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. అప్పటి నుంచి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు సమన్వయంతో పని చేస్తే ఏప్రిల్ చివరి నాటికి తిరిగి మరలా అక్కడ ప్రజలు నివాస స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చూడవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మహాలక్ష్మి దొర, సర్వేయర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయండి

కుంచనపల్లిలో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్, ఎస్సీ కమ్యూనిటీ హాలు పనులు పూర్తిచేసి వారం రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కార్పొరేషన్ అధికారులతో కలసినగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా శుక్రవారం పర్యటించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కుంచనపల్లి- ప్రాతూరు రోడ్డులో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం నుంచి కుంచనపల్లి సచివాలయం వరకు రోడ్డు విస్తరణపై స్థానికులతో చర్చించారు. వారు సానుకూలంగా స్పందించి ఇరువైపులా ఐదు అడుగుల స్థలాన్ని రోడ్డు విస్తరణకు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారులకు రాతపూర్వకంగా అందించిన వెంటనే కుంచపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయిన్ నిర్మాణం చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే ఆర్కే స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం మంగళగిరి నగరంలోని సగర కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలించారు. నృసింహస్వామి వారి కల్యాణ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ అధికారులతో కలసి పరిశీలించి శివాలయం పక్కనే ఉన్న వాహన శాల వద్ద ఉన్న బావిని బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు.

చేనేత మగ్గాలకు మరో చోట స్థల పరిశీలన

నగరంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో జరుగుతున్న మగ్గాల షెడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పరిశీలించారు. టిడ్కో సముదాయంలో రెండు చోట్ల ఖాళీ స్థలాలను పరిశీలించి వాటిలో కూడా పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం అదే ప్రాంతంలో రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ విజయ్‌కుమార్, హ్యాండ్‌లూమ్ ఏడీ వనజ, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి, తాడేపల్లి పట్టణాల కన్వీనర్లు మునగాల మల్లేశ్వరరావు, బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, కుంచనపల్లి కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ సర్పంచ్ బిరుదుగడ్డ విజయేంద్రరావు, గడ్డం తాతయ్య, మాజీ ఉప సర్పంచ్ అమరా నాగయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయానికి స్థలం కేటాయించాలని వినతి

నగరంలోని అమరావతి రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్‌కు నూతన కార్యాలయ నిర్మాణానికి సంబంధించి స్థలంతోపాటు టెక్నీషియన్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు షేక్ రషీద్, షేక్ ఖాజా, అసోసియేషన్ ప్రతినిధులు పఠాన్ అశోక్ ఖాన్, షేక్ ఆసిఫ్, అబ్దుల్ రెహ్మాన్, మౌలాలీ, జిలాని, రవి, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేను కలసిన జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన పలువురు నాయకులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కలసి కృతజ్ఞతలు తెలిపారు. వీవర్స్ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావులు ఎమ్మెల్యే ఆర్కేకి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, ఈమని సొసైటీ అధ్యక్షులు ఏసుపాదం, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి వీరయ్య, ఎండీ ఫిరోజ్, పలగాని కోటేశ్వరరావు, తోట శ్రీను, ఎస్కే జానీ, పిల్లి ధర్మారావు, కేశవరావు, చంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి

మెప్మా ఆధ్వర్యంలో పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం మెయిన్ గేటు వద్ద యునెస్కో ఆధ్వర్యంలో మెప్మా వారు ఏర్పాటు చేసిన హ్యాండ్‌వాష్ ట్యాంక్‌కు ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో బయటకు వెళ్లి వచ్చిన తరువాత ఇంట్లోకి వచ్చే సమయంలో కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కుని వచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ హేమమాలిని, సెక్రటరి శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి, మెప్మా సీఎంఎంలు నారాయణ, పావని, యానిమేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దాలి



కార్పొరేషన్ కొనుగోలు చేసిన ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ప్రతి రోజూ చెత్తను తొలగించాల్సిందేనని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కొనుగోలు చేసిన పారిశుద్ధ్య ట్రాక్టర్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. కోటీ 30 లక్షలు కేటాయించి కార్పొరేషన్ 12 ట్రాక్టర్లను కొనుగోలు చేసిందని, ప్రస్తుతం చెత్తను తరలిచేందుకు ఉన్న వాహనాలు చాలకపోవడంతో కార్పొరేషన్ కొత్త ట్రాక్టర్లను కొనుగోలు చేసిందని, నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ఒక్క ప్రాంతంలో శానిటేషన్ అధికారులు పరిశీలించి చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, సెక్రటరీ శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గట్టెక్కనున్న విద్యార్థుల కష్టాలు

- చొరవ చూపిన ఎమ్మెల్యే ఆర్కే
- రెండు ఫుట్ బ్రిడ్జిల నిర్మాణానికి ముందుకొచ్చిన కాంటినెంటల్ కాఫీ కంపెనీ
- సర్వే చేసిన కంపెనీ ప్రతినిధులు



ఫుట్ బ్రిడ్జిల నిర్మాణాలకు సర్వే చేస్తున్న కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ఇంజినీర్ల బృందం

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో దుగ్గిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కష్టాలు గట్టెక్కనున్నాయి. దుగ్గిరాల బకింగ్‌హాం కెనాల్‌పై ఫుట్ బ్రిడ్జి నిర్మించేందుకు దుగ్గిరాల మండలం మంచికలపూడిలో ఉన్న కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ కంపెనీ వారు ముందుకువచ్చి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కాలంలో కాంటినెంటల్ కాఫీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే ఆర్కే కలసి మంచికలపూడి, దుగ్గిరాల, సుగాలీకాలనీల వద్ద ఫుట్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. స్పందించిన వారు రెండు చోట్ల సర్వే నిర్వహించి ఫుట్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం వల్ల దుగ్గిరాల ప్రాంతంలోని ఎస్సీ కాలనీ, చెన్నకేశవనగర్ ప్రజలతో పాటు దుగ్గిరాల బాలికలు, బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు సులువుగా పాఠశాలలకు చేరుకుంటారు. మంచికలపూడి వద్ద పెట్రోలు బంకు ఎదురుగా నిర్మిస్తున్న ఫుట్ బ్రిడ్జి వల్ల ఆ ప్రాంత రైతులకు సైతం ఎంతో మేలు చేకూరనుంది. ఫుట్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు సైతం పొందినట్లు కాంటినెంటల్ కాఫీ పౌడర్ కంపెనీ ఇంజినీర్లు తెలిపారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఫుడ్ డెలివరీ వాహనాలు అందజేత



అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఫుడ్ డెలివరీ వాహన పత్రాలు అందజేస్తున్న టోల్ ప్లాజా ప్రతినిధులు

తాడేపల్లిరూరల్: నగర పరిధిలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు కీసర టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో రెండు ఫుడ్ డెలివరీ వాహనాలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం అక్షయ పాత్ర ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వాహనాల పత్రాలను అందజేశారు. స్వర్ణ టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ కీసర టోల్‌ప్లాజా కంపెనీ సెక్రటరీ రమణ సాయి, డీజీఎం రాజారావు అక్షయ పాత్ర ఫౌండేషన్ వారికి 2వేల మంది పై చిలుకు పిల్లలకు భోజనం సరఫరా చేసేందుకు వీలుగా రెండు వాహనాలను తయారు చేసి అందించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ జయప్రకాష్, అక్షయ పాత్ర ఈహెచ్ఎస్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



తాడికొండ సీఐ శ్రీనివాసరావు



తాడికొండ కానిస్టేబుల్ కిరణ్‌బాబు

నగరంపాలెం: వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన సీఐలు, ఎస్ఐ, కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అభినందించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాల్‌లో శుక్రవారం జిల్లా నేర సమీక్ష సమావేశం జరిగింది. సమావేశ అనంతరం చేబ్రోలు పీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్ఐ డి.రవీంద్రబాబు, మహిళా కానిస్టేబుల్ నాగమణి, తాడికొండ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బి.కిరణ్‌బాబును ప్రత్యేకంగా అభినందించి ప్రశంస పత్రాలను అందించారు. 2021లో కాకుమాను మండలం వల్లూరులో తల్లిని తనయుడు హత్య చేయగా, ఈ కేసులో తనయుడికి గురువారం యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 2015లో తాడికొండ పాములపాడులో ఒకరిని హత్య చేయగా, అందులో ముగ్గురికి పదేళ్లు, మిగతా అయిదుగురికి ఒక్కొక్క సంవత్సరం కారాగార శిక్ష రెండు రోజుల క్రితం విధించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



మాట్లాడుతున్న సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎరువులపై సబ్సిడీలు తగ్గించి ధరలు పెంచారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అండగా ఉన్న ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో భారీ కోతలు విధించి పేదల కడుపు కొట్టారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపకపోగా కడప ఉక్కు, రాజధాని నిర్మాణం, పోలవరానికి నిధులు ఇవ్వలేదని, ఈ విధంగా బడ్జెట్‌లో రాష్ట్రం పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించిందని అన్నారు. అదానీ కుంభకోణం అంతర్జాతీయంగా భారతదేశానికి తలవంపులు తెచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆస్తుల్ని, ప్రకృతి వనరుల్ని అదానీపరం చేస్తుండడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగు వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, పి.గిరిజ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ అవగాహన సదస్సు

మేడికొండూరు: భీం భారత్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం జరిగే దళిత బహుజన రాజకీయ అవగాహన సదస్సుని జయప్రదం చేయాలని భీం భారత్ జిల్లా నాయకులు పరస నాగరాజు కోరారు. మండలంలోని పేరేచర్ల జంక్షన్‌లో శుక్రువారం భీం భారత్ ఆధ్వర్యంలో జరిగే రాజకీయ అవగాహన సదస్సు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాగరాజు మాట్లాడుతూ దళితులు రాజకీయ చైతన్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతైనా అవసరముందని తెలిపారు. గుంటూరు అరండల్‌పేట 1వ లైన్‌లోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ భవన్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథులు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు హాజరవుతారని తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల దళిత బహుజన వర్గాలు, ప్రజలు, నాయకులు విరివిగా పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పేరేచర్ల జంక్షన్‌లో కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో పెయ్యల ఆశీర్వాదం, నక్కా జయరాజు, నాగినేని రవి, పసుమర్తి రమేష్, మండల అంబేద్కర్ యూత్ నాయకులు వీరు, తాటిగిరి అజయ్, పసుమర్తి నాగార్జున, గొడవర్తి నాయక్ తదితరలు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి బ్యాంక్ సేవలు ప్రశంసనీయం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- నూతన భవనంలోకి బ్రాంచి కార్యాలయం మార్పు



చైతన్య గోదావరి బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

తాడేపల్లిరూరల్: కౌలు రైతులు, డ్వాక్రా గ్రూపు మహిళలకు చైతన్య గోదావరి బ్యాంక్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జాయింట్ కలెక్టర్ రాజకుమారి అన్నారు. తాడేపల్లి గేటు సెంటర్ వద్ద ఉన్న చైతన్య గోదావరి బ్యాంక్ కార్యాలయాన్ని అదే ప్రాంతంలో కొత్త భవనంలోకి మార్చారు. చైతన్య గోదావరి బ్యాంక్ నూతన భవనాన్ని జాయింట్ కలెక్టర్ రాజకుమారి శుక్రవారం ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అమలు చేయడంలో ప్రముఖ ప్రాత వహిస్తోందని అన్నారు. డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కులు అందజేశారు. ఎంఎస్ఎంఈ రంగంలో చైతన్య గోదావరి బ్యాంక్ చేసిన సేవలకుగాను జాతీయస్థాయిలో ఎస్ఐఎం, ఎస్ఎంఈ అవార్డు అందుకున్న బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు రీజనల్ మేనేజర్ పి.వీరారెడ్డి, తాడేపల్లి బ్రాంచ్ మేనేజర్ తిరుమలశెట్టి పవన్‌కుమార్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ ఫార్మసీ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయ ఫార్మసీ విద్యార్థులు శుక్రవారం పెరికలపూడి గ్రామంలో గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫార్మసీ అధ్యాపకురాలు డాక్టర్ లోకేశ్వరి మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణ చర్యలతోపాటు హెచ్‌పీవీ టీకాల గురించి అవగాహన కల్గి ఉండడం ముఖ్యమని అన్నారు. గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు, చికిత్సల ఎంపికల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. పాప్ స్మెర్ పరీక్షలు, చికిత్స చేయించుకోవడం కంటే క్యాన్సర్ రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ అధ్యాపకురాలు రాజేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన అధ్యాపకులను, విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్‌లు అభినందించారు.

సర్వీస్ నౌ టెక్నాలజీపై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సర్వీస్ నౌ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ సర్వీస్ నౌ సంస్థ సీనియర్ డైరెక్టర్ మందా అనిత విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ సర్వీస్ నౌ టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడం వలన ప్రాంగణ ఎంపికల్లో మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. అనంతరం హ్యాక్‌థాన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, సర్వీస్ నౌ సంస్థ వర్క్ ఫోర్స్ అభివృద్ధి నిపుణులు భాస్కర్, క్లయింట్ సక్సెస్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, సర్వీస్ నౌ భాగస్వామి సంస్థ జీటెక్‌నో సీఈవో విద్యాసాగర్, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, అధ్యాపకుల వ్యవహారాల డీన్ డాక్టర్ వి.శ్రీకాంత్, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రామకృష్ణ, డాక్టర్ టి.పవన్‌కుమార్, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, డాక్టర్ శ్యామ్, డాక్టర్ పి.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కోలా సుబ్బారావు రోడ్డు, ఆంజనేయ స్వామి గుడి ప్రాంతం, పంచాయతీ ఆఫీస్ ప్రాంతం, ఉండవల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలతో అరుదైన ఘనత



కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ వివరాలు వెల్లడిస్తున్న మణిపాల్ వైద్యులు

తాడేపల్లిరూరల్: వైద్యరంగ చరిత్రలో మణిపాల్ హాస్పిటల్ మరో అరుదైన ఘనత సాధించింది. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వి.వెంకటకృష్ణ సందీప్ మాట్లాడుతూ చిన్న పిల్లలకు అతి సున్నితమైన కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. పిల్లలందరికీ కాక్లియర్ ఇంప్లాంటేషన్ చికిత్సను ఉచితంగా అందించామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇప్పటి వరకు 70 మందికి పైగా పిల్లలు చికిత్స పొందారని వివరించారు. అనంతరం ఆడియాలజిస్ట్ జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ చాలామంది పిల్లలు పుట్టుకతోనే వినికిడి సమస్యను కలిగి ఉంటారని, అటువంటి వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు చేయడంలో మణిపాల్ హాస్పిటల్ ప్రథమ స్థానంలో ఉండడం గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ ఘనత సాధించిన డాక్టర్ వి.వెంకటకృష్ణ సందీప్, డాక్టర్ అన్నే జయకృష్ణ, డాక్టర్ శ్రీధర్ జాస్తిలను అభినందిస్తున్నామని అన్నారు.

జొన్న పంటను పరిశీలించిన ఏపీ సీడ్ సర్టిఫికేషన్ డైరెక్టర్

తాడికొండ: తాడికొండలో మల్లేశ్వర సీడ్స్ ద్వారా రైతులు బాండ్‌పై సాగు చేస్తున్న జొన్న వెరైటీ సీఎస్‌హెచ్-24ను శుక్రవారం ఏపీ సీడ్ సర్టిఫికేషన్ డైరెక్టర్ ఎ త్రివిక్రమ్‌రెడ్డి, పలువురు శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులతో సాగులో ఏర్పడిన సమస్యలు, పలు మెలకువలపై సూచనలు జారీ చేశారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో పంట బాగా పండిందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌సీఏ జాయింట్ డైరెక్టర్ వి విశ్వనాథన్, ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం సీడ్ డైరెక్టర్ ఎ సుబ్బరామిరెడ్డి, శాస్త్రవేత్త గంగాదేవీ, సీఎస్‌సీవో డీడీ బి ప్రసాద్, ఏవో నరసింహారావు, ఏపీసీడ్స్ డీఎం గుంటూరు సుబ్బయ్య, మల్లేశ్వర ఏజెన్సీస్ ఎండీ అనీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు విప్లవాత్మకం

- ఈ అంశంపై రచయితలు తమ వ్యాసాలు, రచనలు పంపవచ్చు
- ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు



తాడేపల్లిరూరల్: జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్క గ్రంథాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా ప్రభుత్వం మారుస్తుందని గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం మంగళగిరి రాష్ట్ర గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మన సంస్కృతి సాంప్రదాయాలతో పాటు, మన చరిత్రను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన ఇతర అంశాలను పొందుపరుస్తూ ప్రతి లైబ్రరీని డిజిటలైజేషన్ చేస్తున్నారన్నారు. వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు ఓ విప్లవాత్మకమైన మార్పు అని అన్నారు. ఈ కార్యక్రమంపై కవులు, మేధావులు, రచయితలు తమ కవితలు, పాటలు, పద్యాలు, వ్యాసాలను మార్చి 7వ తేదీ లోపు మనం - మన గ్రంథాలయం, గ్రంథాలయ పరిషత్ కార్యాలయం, మెట్ల బజార్, మంగళగిరి, గుంటూరు జిల్లా అడ్రస్‌కు పంపవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9849974431 నెంబరులో సంప్రదించాలన్నారు.